

విద్యార్థినులకు సర్వైకల్ కేన్సర్‌పై అవగాహన

పాలకొల్లు : పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఉమెన్ ఎంపవర్మెంట్, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యాన మెన్స్ ట్రూవల్ హైజిన్ అండ్ సర్వైకల్ కేన్సర్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి యువతులలో రుతు శుద్ధి పాటించడం ఎంత ముఖ్యమో వివరిస్తూ.. శారీరక ఆరోగ్యం, ఆత్మ విశ్వాసం కోసం శుభ్రతను సరిగ్గా పాటించమని వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి కొల్లా భాస్కరమ్మ వీరరాఘవులు ట్రస్ట్ కన్వీనర్ ఎ.మౌనిక రుతు సమస్యలు, వాటి పరిష్కారాలు, సురక్షితమైన శానిటరీ ఉత్పత్తుల వాడకం, సర్వైకల్ కేన్సర్ లక్షణాలు, నిరోధక చర్యలు వంటి అంశాలపై సమగ్రంగా వివరించారు. సర్వైకల్ కేన్సర్ నుండి రక్షణ కోసం హెచ్‌పివి వ్యాక్సిన్, పాప్ స్మియర్ టెస్టుల ప్రాముఖ్యతపై విద్యార్థినులకు అవగాహన కల్పించి విద్యార్థుల సందేహాలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఫెమినా లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఆర్.దీప్తి, డాక్టర్ మౌని ఫెమీనా క్లబ్ సెక్రటరీ పాల్గొన్నారు.



దాళ్వాకు ఢోకా లేనట్టేనా..!

సాగునీటికి ఇబ్బంది లేదంటున్న ఇరిగేషన్ అధికారులు

గోదావరి నీటిలభ్యత 65 టిఎంసిలు ఉన్నట్లు అంచనా

సీలేరు నుంచి మరో 23 టిఎంసిల వరకూ లెక్క

ఉమ్మడి పశ్చిమలో 4.60 లక్షల ఎకరాల్లో దాళ్వా సాగు

తమ్మిలేరు, కొవ్వాడ, ఎర్రకాలువ జలాశయాల్లోనూ పుష్కలంగా నీళ్లు

వచ్చేవారంలో జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

దాళ్వా సాగుకు సంబంధించిన నీటి సరఫరాపై ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వలేదు. దాళ్వా సాగునీటిపై నిర్ణయం తీసుకునే జిల్లా సాగునీటి సలహామండలి సమావేశం ఇప్పటికీ ఏర్పాటు చేయకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. దాళ్వాకు పూర్తిస్థాయిలో సాగునీరు అందుతుందా, లేదా అనే గుబులు రైతులను వెంటాడుతోంది. ఇప్పటి వరకూ దాళ్వాసాగుకు సాగునీటి సరఫరాపై అధికారికంగా ఎటువంటి ప్రకటనా రాలేదు. మరో వారం, పది రోజుల్లో దాళ్వా నారుమడులు వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. దాళ్వా సాగుకు నీటిసరఫరాపై స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఇరిగేషన్ అధికారులు మాత్రం ఈ ఏడాది దాళ్వాకు సాగునీటి సమస్య ఉండదని చెబుతున్న పరిస్థితి ఉంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దాళ్వాకు 4.60 లక్షల ఎకరాలు, తూర్పుగోదావరి జిల్లాలో 4.36 లక్షల ఎకరాలకు గోదావరి నుంచే సాగునీటి సరఫరా సాగుతోంది. మొత్తం రెండు జిల్లాల ఆయకట్టుకు, తాగునీటికి 91.350 టిఎంసిల నీరు అవసరం. ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా కురిశాయి. దీంతో గోదావరిలో నీటిలభ్యత 68 టిఎంసిల వరకూ ఉంటుందని అధికారులు అంచనాలు రూపొందించినట్లు తెలుస్తోంది. సీలేరు ద్వారా మరో 22.95 టిఎంసిలు నీరు వచ్చే అవకాశం ఉందని, దాళ్వాలో సాగునీటికి ఎటువంటి ఇబ్బందీ ఉండదనే లెక్కలు చెబుతున్నారు. పోలవరం స్పిల్‌వే వద్ద నీటిమట్టం 26.860 మీటర్ల వరకూ ఉంది. ప్రస్తుతం అధికారుల అంచనాల ప్రకారం దాళ్వాకు పూర్తిస్థాయిలో సాగునీరు అందే అవకాశం కన్పిస్తోంది. జిల్లా సాగునీటి సలహామండలి సమావేశంలో ఈ విషయం వెల్లడించిన తర్వాతే అధికారికంగా ధ్రువీకరిస్తారు. కొన్నేళ్లుగా రబీలో రైతులు సాగునీటి కోసం ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. వంతుల వారీ విధానంతో రాత్రి, పగలు పొలాల వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఉంది. శివారు పొలాలకు సక్రమంగా నీరందని పరిస్థితి కొనసాగుతోంది. దీంతో రైతులు మోటారు ఇంజిన్లు వంటివి ఉపయోగించాల్సి వస్తోంది. దీంతో రైతులకు పెట్టుబడి తడిసి మోపెడవుతోంది. ఈ ఏడాదైనా వంతులవారీ విధానం లేకుండా సాఫీగా దాళ్వాసాగుకు నీటిని అందించాలని రైతులు కోరుతున్నారు. అదే క్రమంలో వరిసాగుకు కాకుండా కొంతమంది అధికారులు చేపల చెరువులకు ప్రాధాన్యత ఇస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా సాగునీటి సరఫరా జరిగేలా ప్రభుత్వం ముందుగానే చర్యలు తీసుకోవాల్సి ఉంది. గత కొన్నేళ్లుగా డెల్టా ఆధునికీకరణ పనులు జరగకపోవడంతో పంట కాలువలు మెరకదేరి నీరు కిందకు పారడం లేదు. దీంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే కాలువల్లో పేరుకుపోయిన కర్రనాచు, గుర్రపుడెక్కను తీయించడంతోపాటు దెబ్బతిన్న షట్టర్లకు మరమ్మతులు చేయించాల్సి ఉంది. పక్కా ప్రణాళికతో ముందుకు సాగకపోతే దాళ్వాలో రైతులు సాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడే ప్రమాదం ఉంది.

జలాశయాల్లో పుష్కలంగా నీళ్లు

తమ్మిలేరు రిజర్వాయర్‌లో 355 అడుగుల నీటిమట్టానికిగాను 347 అడుగుల నీటిమట్టంతో 2.7 టిఎంసిల నీటి నిల్వలు అందుబాటులో ఉన్నాయి. తమ్మిలేరు ప్రాజెక్టు కింద ఉన్న 8,200 ఎకరాలకు ఆయకట్టుకు సాగునీరు అందించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. కొవ్వాడ రిజర్వాయర్‌లో 90.50 అడుగుల నీటిమట్టానికిగాను 90.15 అడుగుల నీటిమట్టంతో 0.407 టిఎంసిల నీరు అందుబాటులో ఉంది. ఎనిమిది వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలుస్తోంది. ఎర్రకాలువ రిజర్వాయర్‌లో నీటిమట్టం 83.50 మీటర్లకుగాను 82.18 మీటర్లు నీటిమట్టంతో 3.29 టిఎంసిల నీరు అందుబాటులో ఉంది. ఎర్రకాలువ జలాశయం పరిధిలోని 15 వేల ఎకరాల పూర్తి ఆయకట్టుకు నీరందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

వచ్చే వారంలో జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం

సిహెచ్.దేవప్రకాష్, జిల్లా ఇరిగేషన్ అధికారి

దాళ్వాకు సంబంధించిన నీటి సరఫరాపై ఈ వారంలో తూర్పుగోదావరి జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం జరగనుంది. ఆ తర్వాత మన జిల్లాలో సమావేశం జరుగుతుంది. దాళ్వాలో సాగునీటికి సంబంధించి ఇబ్బంది ఉండదు. పూర్తి వివరాలు సాగునీటి సలహా మండలి సమావేశంలో వివరిస్తాం.

ధాన్యం కొనుగోలుకు కొత్త సంచులు ఇవ్వాలి

తేమశాతం నిబంధనలు సడలించి

తూకంలో మోసాలు అరికట్టాలి

ఎపి కౌలురైతుసంఘం వినతి

ధాన్యం తూకాల్లో మోసగిస్తే కేసులే: జెసి రాహుల్‌కుమార్‌రెడ్డి



జెసికి వినతి అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం

ధాన్యం కొనుగోలుకు కొత్త గోనె సంచులు ఇవ్వాలని కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఉదుర్తి శ్రీనివాసరావు, మామిడిశెట్టి రామాంజనేయులు కోరారు. తేమ శాతం నిబంధనలు సడలించి తూకాల్లో మోసాలు అరికట్టి ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. స్థానిక కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డికి ధాన్యం కొనుగోలులో సమస్యలపై సంఘం ఆధ్వర్యంలో శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు, రామాంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం ఖరీఫ్ పంట కోత దశకు వచ్చిందని, కొన్ని ప్రాంతాల్లో కోతలు మొదలయ్యాయని తెలిపారు. ప్రతి సంవత్సరం పంట అమ్ముకునే సమయంలో గోనె సంచులు సక్రమంగా అందించట్లేదని, ఇచ్చినవాటిలో 40 శాతం వరకు చిరిగిపోయిన సంచులు ఉండటంతో రైతులు నానావస్థలు పడుతున్నారని తెలిపారు. ధాన్యం పట్టే మధ్యవర్తులు తరుగు వస్తుందని, తాలు తప్ప ఉంటుందని ప్రతి సార బస్తాకు అదనంగా రూ.600 గ్రాముల ధాన్యం తూచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల మొంథా తుపాన్ ధాటికి ధాన్యం తేమశాతం అధికంగా ఉంటుందని, ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు బాగోలేదని, ఈ నేపథ్యంలో తేమశాతం నిబంధనలు సడలించి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. తక్షణం 50 కేజీలు పట్టే కొత్త గోనె సంచులు ఇవ్వాలన్నారు. తూకాల్లో మోసాలు అరికట్టాలని కోరారు. దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ కె.రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 50 కిలోలు పట్టేలా కొత్త గోనె సంచులు ఇవ్వాలని, పాత సంచులను నవీకరించాలని సంబంధిత అధికారులకు సూచిస్తామన్నారు. తూకాల్లో మోసం చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. తేమశాతం 23 పాయింట్ల వరకు ఉంటే రైతుసేవా కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్ముకోవచ్చని తెలిపారు.

మేత ధర రూ.6 తగ్గింపు కంటితుడుపు చర్యే

జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఆక్వా రైతుల పోరాటంతో రాష్ట్ర ప్రభుత్వ హామీ మేరకు రొయ్యల మేత కు కేజీకి రూ.6 తగ్గించాయని, అయితే దీనివల్ల రైతులకు ఉపయోగం లేదని జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు చెప్పారు. స్థానిక కాస్మో క్లబ్‌లో శనివారం రైతులతో సమావేశం నిర్వహించారు. అనంతరం గాంధీభగవాన్ రాజు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఒత్తిడి మేరకు ఇటీవల ఫ్యాక్టరీలు మేత ధర కిలోకు రూ.ఆరు తగ్గించాయని, అయితే ఫ్యాక్టరీలు కేవలం ఎంఆర్‌పిని తగ్గించాయని, ఇన్వాయిస్‌పై కాదని తెలిపారు. దీనివల్ల రైతులకు ధర తగ్గలేదని చెప్పారు. కనీసం డీలర్‌కు తగ్గించినా రైతుకు ఉపయోగం ఉండేదని, ఈ అంకెల గారడీ వల్ల రైతుకు ఉపయోగం లేదని స్పష్టం చేశారు. అసలు ఈ తగ్గింపు వల్ల ఎవరికి ఉపయోగమో ప్రభుత్వం వివరణివ్వాలని డిమాండ్ చేశారు. రైతుకు జరిగిన అన్యాయం గురించి చర్చించేందుకు డిసెంబర్ 1న పాలకొల్లులో రైతులు సమావేశమై తదుపరి కార్యాచరణ రూపొందించనున్నట్లు వివరించారు. ఈలోపు రైతులకు జరుగుతున్న అన్యాయంపై రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు ద్వారా వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో నేతలు బోణం చినబాబు, మేడిది జాన్‌రాజు, భూపతిరాజు శ్రీనివాస్, డేవిడ్, పెన్మెత్స రామభద్రరాజు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



విల్లు ఎక్కుపెట్టిన జాయింట్ కలెక్టర్

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14, 17 ఆర్చరీ పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించిన జిల్లా విద్యార్థులు

ప్రజాశక్తి - భీమవరం

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్కూల్ గేమ్స్ అండర్-14, 17 విభాగాల్లో ఆర్చరీ పోటీల్లో రాష్ట్రస్థాయిలో బంగారు, వెండి పతకాలను సాధించిన క్రీడాకారులను స్థానిక కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఆర్చరీలో పతకాలు సాధించిన క్రీడాకారులను జాయింట్ కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. రానున్న రోజుల్లో జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ సత్తా చాటాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. క్రీడల్లో రాణిస్తే మానసిక, శారీరక ఆరోగ్యం పెంపొందించుకోవచ్చుని, చదువులో కూడా చురుగ్గా ఉంటారని తెలిపారు. క్రీడల్లో రాణించినవారికి ఉద్యోగావకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయని సూచించారు. ప్రతిఒక్క విద్యార్థి వారికి ఇష్టమైన ఏదోక ఆటను ఎంచుకుని గెలుపు లక్ష్యంగా సాధన చేయాలన్నారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి నూతక్కి మోహన్‌దాస్, డిఇఒ ఇ.నారాయణ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ కోచ్ జయలక్ష్మి, ఇ.సాహితీ, కమలకిషోర్, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు

స్కూల్ గేమ్స్‌లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. అండర్ 17 విభాగంలో ఎం.సుహాస్, ఎం.సూర్య హంసిని బంగారు పతకాలను సాధించారు. వి.స్ఫూర్తి, హంసిని వెండి పతకాలను సాధించడం జరిగింది. సబ్ జూనియర్ విభాగంలో సుహాస్ బంగారు పతకాన్ని, కపిష్ వెండి పతకాన్ని సాధించడం జరిగింది. స్కూల్ గేమ్స్ లో పతకాలు సాధించిన వారు వారణాసి లో జరిగే 69వ నేషనల్ గేమ్స్ లో పాల్గొననున్నారు. అలాగే సబ్ జూనియర్స్ విభాగంలో పతకాలు సాధించిన వారు అరుణాచల్ ప్రదేశ్ లో ఈనెల 23 నుండి 30 వరకు జరిగే నేషనల్స్ లో పాల్గొననున్నారు.

రేపు, ఎల్లుండి రైతుసంఘం జిల్లా మహాసభ

సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం



నినదిస్తున్న రైతు నేతలు

ప్రజాశక్తి - పాలకోడేరు

ఎపి రైతుసంఘం 23వ జిల్లా మహాసభ ఈ నెల 17, 18 తేదీల్లో మొగల్లులో నిర్వహిస్తామని, ఈ మహాసభను జయప్రదం చేయాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం పిలుపునిచ్చారు. మహాసభ జయప్రదం చేయాలని కోరుతూ మొగల్లులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరేరాం మాట్లాడుతూ ఈ మహాసభల్లో రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆక్వా రైతు సంఘం రాష్ట్ర నాయకులు బి.బలరాం పాల్గొంటారని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆక్వారంగం చాలా ఒడిదుడుకుల్లో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సార్వా ధాన్యం కోతలు ప్రారంభమైన సందర్భంగా ఎటువంటి ఇబ్బందులూ లేకుండా రైతుల ధాన్యం అమ్ముకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. గోనె సంచుల కొరత లేకుండా చూడాలని, తేమశాతం పేరుతో మిల్లర్ల దోపిడీని అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలా వెంకటస్వామి, వాసుబాబు, ఆత్రేయ పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు : సిఐ


ప్రజాశక్తి - ఆచంట

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పెనుగొండ సిఐ ఆర్.విజయ్ కుమార్ హెచ్చరించారు. శాంతిభద్రత పరిరక్షణ, నేర నియంత్రణే ధ్యేయంగా జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి ఆదేశానుసారం జిల్లా వ్యాప్తంగా కార్డన్ సెర్చ్ ఆపరేషన్ కార్యక్రమాలు జరుగుతున్నాయని, వీటిలో భాగంగా శనివారం తెల్లవారుజాము నుంచి పెదమల్లం గ్రామంలో నరసాపురం డిఎస్‌పి జి.శ్రీవేద ఆధ్వర్యాన కార్డన్ సెర్చ్ ఆపరేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీ చేసి సరైన రిజిస్ట్రేషన్ పత్రాలు, యజమాని వివరాలు సరిగా లేని పలు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వాహనాలకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించేందుకు వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సిఐ విజయ్ కుమార్ గ్రామంలోని స్థానిక ప్రజలతో ముఖాముఖి మాట్లాడి, కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ తనిఖీల్లో ఆచంట ఎస్‌ఐ కె.వెంకటరమణ, పెనుగొండ ఎస్ఐ కె.గంగాధర్, పెనుమంట్ర ఎస్ఐ కె.స్వామి, సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.

రత్నమాలకు బెస్ట్ ఉమెన్స్ అవార్డు

ప్రజాశక్తి - ఆచంట

భీమలాపురం గ్రామానికి చెందిన ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు డాక్టర్ కొత్త కనక రత్నమాల వెంకటేశ్వర్లు తమిళనాడులో సోషల్ వర్క్ బెస్ట్ ఉమెన్స్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా తమిళనాడు రోటరీ అసోసియేషన్ క్లబ్ ఆధ్వర్యాన ఆమెకు అవార్డును అందజేశారు. ఆమెకు ఆంధ్రప్రదేశ్‌తో పాటుగా ఇతర దేశాలు, ఇతర రాష్ట్రాల్లో కూడా అనేక అవార్డులు అందుకున్నట్లు మంచి పేరు సంపాదించారు. ఈ అవార్డు రావడం పట్ల సర్పంచ్ గుబ్బల మాధవరావు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు రత్నమాలను అభినందించారు.



అవార్డు అందుకుంటున్న కొత్త కనకరత్నమాల

అఖిలభారత మహాసభను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - వీరవాసరం

శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలని, దోపిడి పోవాలని నిరంతరం పనిచేస్తున్న సిఐటియు అఖిలభారత మహాసభలు డిసెంబర్ 31, జనవరి 1, 2, 3, 4 తేదీల్లో విశాఖపట్నంలో జరుగుతున్నాయని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ తెలిపారు. శనివారం వీరవాసరంలో జరిగిన సిఐటియు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ మహాసభలు జయప్రదంగా నిర్వహించేందుకు మన జిల్లాలో ఉద్యోగులు, కార్మికులు గట్టిగా కృషిచేయాలని, అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో నిరుద్యోగం, అధిక ధరలు పెరిగిపోతున్నాయని, వాటికి పరిష్కారం చూపించాల్సిన పాలకులు ఓట్లు, సీట్లు కోసం మాట్లాడుతున్నారు తప్ప ప్రజా సమస్యలపై మాట్లాడటం లేదన్నారు. వేల కోట్ల రూపాయలు కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని, భూసేకరణ చేసి పెట్టుబడిదారులకు అప్పగించాలని చూస్తున్నారని అన్నారు. ఉద్యోగులకు కార్మికులకు కావలసిన పిఆర్‌సి, కనీస వేతనాలు కాంట్రాక్టు విధానాన్ని రద్దుచేసి పర్మినెంట్ ఉద్యోగులుగా చేయడం వంటి సమస్యలను గాలికి వదిలేసారన్నారు. ఒకపక్క అభివృద్ధి అయిపోతుందని చెప్పుకుంటున్న పాలకులు ఉద్యోగులు, కార్మికులు అడుగుతున్నా ప్రశ్నలకు సమాధానం చెప్పలేని స్థితిలో ఉన్నారన్నారు. విద్యా, వైద్యం, ఉపాధి ఇతర సౌకర్యాలు రోజురోజుకీ కుదించ పడుతున్నాయని, వీటన్నిటిని రక్షించుకోవడానికి పోరాటాలు తప్ప మరో మార్గం లేదన్నారు. ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం జరుగుతున్న పోరాటంలో సిఐటియు ముందుందన్నారు. అఖిల భారత మహాసభ సందర్భంగా జనవరి 4వ తేదీన విశాఖపట్నంలో గొప్ప బహిరంగ సభ, ఊరేగింపు జరుగుతున్నాయని, జిల్లాలో ఉన్న ఉద్యోగులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సమావేశానికి సిఐటియు మండల కన్వీనర్ వరలక్ష్మి అధ్యక్షత వహించారు. గీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు, రైతు సంఘం నాయకులు అలమహారాజు రాము, నారాయణమూర్తి, కొత్తల సత్తిబాబు, సుబ్బారావు, శ్యాము పాల్గొన్నారు.

కార్మిక పక్షపాతి బాబూరావు

సంస్మరణ సభలో నేతలు

ప్రజాశక్తి - పెంటపాడు

ఎర్రజెండా ముద్దుబిడ్డ, కార్మిక పక్షపాతి, పేద బడుగు బలహీన తరగతుల ఆశాజ్యోతి చింతకాయల బాబూరావు సంతాప సభ పెంటపాడు ప్రజాసంఘాల కార్యాలయం వద్ద శనివారం నిర్వహించారు. ముందుగా బాబూరావు చిత్రపటానికి దూలం ప్రసాద్, జె.శ్యామల కుమారి, సిరపరపు రంగారావు, బొంకూరు నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, పెంటపాడు నాయకులు బొంకూరు నాగేశ్వరరావు, చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ 1982లో గణపవరం మండలం నుంచి రైస్ మిల్ డ్రైవర్‌గా ఉన్న బాబూరావు 1983లో సిఐటియులోకి వచ్చిన నాటి నుంచి అంచలంచెలుగా ఎదుగుతూ సిఐటియు జాతీయ కౌన్సిల్లో సభ్యుడుగా అనేక బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. ఉమ్మడి ప.గో జిల్లాలో అనేక సంఘాలు ఏర్పాటు చేసి 1985 నుండి 2005 వరకు అనేక ఉద్యమాలు, పోరాటాల్లో పాల్గొని సమస్య పరిష్కారం అయ్యేవరకు పోరాడిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన సిద్ధాంతాన్ని, ఆయన ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లడమే ఆయనకిచ్చే నిజమైన నివాళి అని తెలిపారు. కార్యక్రమంలో ఆర్.అనురాధ, బి.వీరరాఘవమ్మ, కసిరెడ్డి అచ్చిమ్మ, వై.జయంతి, ఎం.సీత, ఎ.ఆదిలక్ష్మి, బి.సునీల్ కె.కవల కృష్ణ, కె.సంతోష్ శివ పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని వినతి



సంతకాలు సేకరిస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట వేమవరం గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్ రావు అన్నారు. శనివారం సిపిఎం ఆధ్వర్యంలో డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని కోరుతూ సంతకాల సేకరణ చేపట్టారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి పి.చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ ఆచంట వేమవరంలో దీర్ఘకాలంగా డ్రెయినేజీ సమస్య పట్టిపీడిస్తుందన్నారు. ఈ సమస్య ఏళ్ల తరబడి పరిష్కారం కాకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారి వెంబడి పశువుల ఆసుపత్రి సమీపంలోనూ సగం వరకు డ్రెయినేజీ సౌకర్యం కల్పించి మధ్యలో అసంపూర్ణంగా వదిలేశారన్నారు. దీంతో ఆ గ్రామస్తులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. డ్రెయినేజీల్లోని మురుగునీరు స్థానిక పంట కాల్వలో కలిసిపోవడంతో నీరు కలుషితమై పంటలకు నష్టం వాటిల్లుతుందన్నారు. పంచాయతీ పరిధిలోని పెదపేట, వెంకటాయపాలెం, ఇసుక గరువు, పసల పేట, లింగాలు చెరువు గట్టు, పడమటిపాలెం తదితర గ్రామాల్లో పరిస్థితి మరీ అధ్వానంగా ఉందన్నారు. డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో ఆ గ్రామస్తులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజాప్రతినిధులు అధికారులు తక్షణమే స్పందించి అసంపూర్తిగా వదిలేసిన డ్రెయినేజీ నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు గుత్తుల రంగారావు, బండి రంగారావు, కొండేటి సత్యనారాయణ, గెద్దాడ త్రిమూర్తులు, రాపాక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంపకాల ఫీట్లు.. తప్పని తలపోట్లు..!



అధికార టిడిపిలో సంస్థాగత కమిటీల నియామకం, ప్రమాణ స్వీకారాల సందడి సాగుతోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి సుమారు 17 నెలల అనంతరం, నామినేటెడ్ పదవుల భర్తీ అనంతరం చేపట్టిన టిడిపి సంస్థాగత ఎన్నికల్లో ఆశావహుల తాకిడి ఆ పార్టీలో ఎక్కువగానే కన్పిస్తోంది. అదే సమయంలో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండటంతో నేతలకు పదవుల పంపకం సులువే అయినా గ్రామ, మండలస్థాయి నేతల తీరుతో నియోజకవర్గ, జిల్లాస్థాయి నేతలు తలలు పట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఎంఎల్ఎలు ఉన్నా నియోజకవర్గం, మండలం, గ్రామస్థాయిలో పట్టుకోసం పైరవీలు సైతం సాగిస్తుండటం గమనార్హం. ప్రధానంగా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచి, ఎంపిపి, వైస్ ఎంపిపి, ఎంపిటిసి పదవులకు ఎవరనేది నిర్ణయించేసి, వారిని పక్కన బెట్టి మిగిలిన వారికి పదవులు కేటాయిస్తున్నారు. అయితే ఎన్నికలకు పరిస్థితి ఎలాగుంటుందోనని తాము ఎంపిపి, వైస్ ఎంపిపి, సర్పంచి పదవులకు ఎన్నికయ్యారు. పార్టీ పదవులు వదులుకుంటామని, అప్పటి వరకూ తమకే పార్టీ పదవులు కట్టబెట్టాలనడం కొన్ని చోట్ల ఆ పార్టీ జిల్లా, నియోజకవర్గ నేతలకు ఇబ్బందికరంగా తయారైంది. ఇక రిజర్వుడు నియోజకవర్గాల్లోనైతే ఆయా ప్రాంతాల్లో ఆధిపత్య కులాలకు చెందిన నేతలు తమ పట్టుకోసం పదవుల కేటాయింపు తాము చెప్పినట్లే సాగించాలని భీష్మించుకుని కూర్చుంటున్నారు. ఒక మండల, గ్రామస్థాయి పదవుల కోసం సైతం జిల్లా, రాష్ట్ర నేతల వద్దకు కార్యకర్తలను తీసుకుని వెళ్లే ప్రయత్నం చేస్తున్నారంటే ఆధిపత్య ధోరణి ఏస్థాయిలో ఉందో స్పష్టమవుతోంది. ఏదేమైనా స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే సంస్థాగత ఎన్నికలతో పదవుల పంపకాల్లో తమకు తలపోట్లు తప్పడం లేదని నియోజకవర్గ, జిల్లాస్థాయి నేతలు మాత్రం తలలు పట్టుకుంటున్నారు.

'మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే' అని మహనీయుడు కారల్ మార్క్స్ ఏనాడో చెప్పారు. అవన్నీ అక్షరసత్యమని మనకు ప్రత్యక్ష సాక్ష్యాలుగా ఈ కాలంలో చోటుచేసుకున్న ఘటనలు కన్పిస్తుండటం గమనార్హం.

తణుకు ప్రాంతంలో 2022లో ఒక యువతి సజీవ దహనం కేసులో ప్రధాన నిందితులు కన్న తండ్రి, అతని రెండో భార్యగా గుర్తించి వారిని అరెస్టు చేసి పోలీసులు జైలుకు పంపారు. 2022లో ముళ్లపూడి నాగహారిక సజీవ దహనం అప్పట్లో పెను సంచలనం సృష్టించింది. మృతురాలి అమ్మమ్మ నాగహారికను హత్య చేసి, దహనం చేసి, సజీవ దహనంగా చూపుతున్నారని మొత్తుకున్నా పట్టించుకున్న దాఖలాల్లేవు. అయితే తాజాగా ఫోరెన్సిక్ నివేదికలో నాగహారికను ముందే చంపి, ఆపై తగలబెట్టారని రావడంతో మృతురాలి కన్నతండ్రిని, అతని రెండో భార్యను అదుపులోకి తీసుకుని విచారించగా వారు నేరం అంగీకరించారు. దీనికి ప్రధాన కారణం నాగహారిక పేరున ఉన్న ఆస్తుల కోసమేనని తేలడం అందరినీ నివ్వెరపర్చింది. ఇటీవలే తుదిశ్వాస విడిచిన కవి అందెశ్రీ చెప్పినట్లుగా 'మాయమైపోతున్నాడమ్మా.. మనిషన్నవాడు' రీతిలో కరోనా కాలంలో ఇంటి యజమానిని కోల్పోయిన ఒక కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురైంది. ఈ క్రమంలో ఆ కుటుంబంలో పెద్ద కుమారుడు మానసిక సమస్యలకు గురయ్యాడు. అవి పెరిగి పెద్దయ్యి కన్న తల్లిని, సొంత తమ్ముడిని అర్ధరాత్రి వేళ అత్యంత పాశవికంగా నరికి చంపడం, ఆపై పోలీసులకు ఫోన్ చేసి తాను తన తల్లిని, తమ్ముడిని చంపేశానని చెప్పడం పోలీసులనే నివ్వెరపర్చింది. అంటే కరోనా కాలం నుంచి దెబ్బతిన్న ఆ కుటుంబాన్నీ సంబంధీకులుగాని, ఇటు పాలకులుగాని పట్టించుకోకపోవడం హత్యలకు దారితీసిందని చెప్పొచ్చు. మొత్తంగా ఈ రెండు ఘటనల్లో డబ్బే కీలకాంశం కావడం గమనార్హం.

- వివిఎస్ఎస్‌వి.ప్రసాద్

స్త్రీ శక్తి పథకం అమలుపై సమస్యలు పరిష్కరించాలి

డిపో ముందు కార్మికుల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు, నాయకులు

తణుకు: ఆర్‌టిసిలో స్త్రీ శక్తి పథకం అమలుపై సమస్యలు పరిష్కరించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు టివిఎస్.మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఎపిఎస్ఆర్‌టిసి(పిటిడి) స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు తణుకు యూనిట్ ఆధ్వర్యాన డిపో ముందు కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టివిఎస్.మూర్తి మాట్లాడుతూ.. స్త్రీ శక్తి పథకం వల్ల కార్మికులపై పని భారం పెరిగిందన్నారు. రాష్ట్రంలో 11 వేల మంది సిబ్బంది అవసరమైనా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. దీనివల్ల కార్మికులపై పని భారం వల్ల కార్మికులను అక్రమ సస్పెన్షన్ చేస్తున్నారన్నారు. స్మార్ట్ కార్డులు ఇవ్వాలని, సిబ్బంది పై దాడులు నివారించాలని, బస్సు స్టేషన్ల ప్రయివేటీకరణ ఆపాలని, అక్రమ రవాణాపై తగు చర్యలు తీసుకోవాలని, ప్రమోషన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘ సభ్యులు కె.నూకరాజు, ఎన్.శ్రీనివాస్, సిహెచ్.రామకృష్ణ, ఎ.ప్రసాద్, కెజిఎన్.సాయికుమార్, ఆర్ఎన్‌విడి.దుర్గారావు, సిఐటియు నాయకులు కామన మునిస్వామి పాల్గొన్నారు.

బోధనా సామగ్రి పంపిణీ

నరసాపురం : నియోజకవర్గ స్థాయిలో జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యాన వికలాంగ పిల్లలకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరాన్ని శనివారం నిర్వహించారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యాన మానసిక వికలాంగ పిల్లలకు మేధో వైకల్యం జాతీయ మానసిక ప్రభుత్వ సంస్థ వారు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా సహిత విద్యా సమన్వయకర్త టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వైకల్యం సమస్యను అధికమించి పాఠశాలకు వెళ్లి నార్మల్ పిల్లతో సమానంగా చదువుకోవడానికి సమగ్ర శిక్ష వారు ఉపకరణాల నిర్ధారణ శిబిరములు నియోజకవర్గం స్థాయిలో నిర్వహించడం జరుగుతుందని, వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు పుష్పరాజ్యం, శామ్యూల్, న్యాయవాది సుప్రజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచితంగా కళ్లజోళ్లు అందజేత

వీరవాసరం : శ్రీవీర రాఘవులు మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఇటీవల నిర్వహించిన మెగా కంటి వైద్య పరీక్షల్లో అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లను ట్రస్ట్ కార్యాలయ వ్యవస్థాపకులు కొల్లా రాము, మద్దాల గోవిందమ్మలు 106 కళ్లజోళ్లను అందజేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవగా భావించే ఈ ట్రస్ట్ ద్వారా ఉచితంగా వైద్య శిబిరాలను నిర్వహించి అవసరమైన వారికి వైద్యం, మందులు ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు.

గ్రామీణులకు మెరుగైన వైద్యసేవలు : ఎంఎల్ఎ

గణపవరం : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకి మెరుగైన వైద్యం అందించడానికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తున్నట్లు ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50 లక్షలతో నిర్మించనున్న బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజలకు వైద్యసేవలందించటంలో విఫలమైందన్నారు. కూటమి నాయకులు డాక్టర్ పి.కిరణ్మయి, ఓంకార్ నాథ్, సిహెచ్ఒ జాలాది విల్సన్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉప కారాగారం తనిఖీ

నరసాపురం: నరసాపురం అదనపు జూనియర్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) ఎస్.రాజ్యలక్ష్మి శనివారం నరసాపురం ఉప కారాగారాన్ని తనిఖీ చేశారు. జైలు ముద్దాయిలను కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షణికావేశంలో చేసే తప్పులకు సమాజంలోను, బంధువుల మధ్యలోను దోషులవుతారని, గొడవలకు వెళ్లే ముందు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకోవాలన్నారు. ఆర్థిక స్తోమత లేనివారు అప్పీల్ చేసుకొనుటకు ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప కారాగారం పర్యవేక్షణాధికారి టి.అప్పారావు, జైల్ సిబ్బంది, ప్యానల్ న్యాయవాది, శిరీష, పిఎల్‌వి బి.శ్యామ్‌కుమార్, రాజీ పాల్గొన్నారు.

అర్ధవరం పోస్టాఫీసులో నగదు గోల్‌మాల్

పోస్టు మాస్టార్ దేవి సస్పెండ్

గణపవరం: అర్ధవరం పోస్టాఫీసులో నగదు గోల్‌మాల్ అవ్వటంతో ఖాతాదారులు శనివారం పోస్టాఫీసు వద్ద ఆందోళనకు దిగారు. స్థానిక పోస్టుమాస్టర్ యాండ్రు దేవి తమ అకౌంట్ నుండి నగదు దొంగిలించారని ఖాతాదారులు చెప్పారు. తాము కష్టపడి దాచుకున్న సొమ్ములు తస్కరించిన దేవిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈవిషయం తెలుసుకున్న తాడేపల్లిగూడెం పోస్టల్ ఇన్‌స్పెక్టర్ టి.సుబ్రహ్మణ్యం అర్ధవరం వచ్చి స్థానిక పోస్ట్‌మెన్ కండలి సొంగ్యతో కలిసి విచారణ చేశారు. ఖాతాదారులకు డబ్బులు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వరి పొలాల పరిశీలన

పెనుమంట్ర: మండలంలోని సోమరాజు ఇల్లిందలపర్రు గ్రామంలో వ్యవసాయ శాఖతో కలిసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రాంతీయ వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్తల బృందం సంయుక్తంగా శనివారం క్షేత్రస్థాయిలో వరి పంటపై ఆశించిన ఎండు తెగులును పరిశీలించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.మల్లికార్జున రావు మాట్లాడారు. డాక్టర్ భువనేశ్వరి, ప్రిన్సిపల్ సైంటిస్ట్, సహాయ వ్యవసాయ సంచాలకులు ఎవి.రమేష్ పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి రూ.50,099 విరాళం



విరాళం అందజేస్తున్న వెంకటకృష్ణ

కాళ్ల : మండలంలోని పెదమిరం గ్రామ దేవత శ్రీపల్లాలమ్మ అమ్మవారి దేవాలయం అభివృద్ధి కోసం పెదమిరం గ్రామానికి చెందిన గణిత ఉపాధ్యాయుడు బూరాడ వెంకటకృష్ణ రూ.50,099 వేలు విరాళంగా కోరా రామూర్తికి శనివారం అందజేశారు. వెంకటకృష్ణ ఇటీవల ఎపి మెగా డిఎస్‌సి 2025లో 4 జాబ్‌లు సాధించి స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్‌గా పనిచేస్తున్నారు. తన మొదటి జీతం అందుకున్న సందర్భంగా ఈ విరాళాన్ని ఆలయ నిర్మాణ, అభివృద్ధి కమిటీ పెద్దలు కోరా రామ్మూర్తికి అందించారు. అభివృద్ధి కమిటీ పెద్దలు, గ్రామస్తులు వెంకటకృష్ణను అభినందించారు.

పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలి : ఎంపిపి



పుస్తక ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎంపిపి

పాలకోడేరు : ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదివే అలవాటు చేసుకోవాలని తద్వారా విజ్ఞానం పెరుగుతుందని పాలకోడేరు ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణ రాజు(చంటిరాజు) అన్నారు. పాలకోడేరు గ్రంథాలయంలో గ్రంథాలయాల వారోత్సవాల్లో భాగంగా శనివారం పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈ పుస్తక ప్రదర్శనను ఎంపిపి చంటి రాజు, డిప్యూటీ ఎంపిడిఓ రాంప్రసాద్, మండల విద్యాశాఖ అధికారి నాగరాజు సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపిపి చంటిరాజు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో చదువుకున్నవాళ్లు ఎంతో ఉన్నతికి చేరారని చెప్పారు. ప్రతి ఒక్కరూ విజ్ఞానం పెంపొందించుకునే విధంగా పుస్తకాలు తరచూ చదువుతూ ఉండాలని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి దేవి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఆలయ పాలకమండలి సభ్యుల ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న సభ్యులు

నరసాపురం : శ్రీఅమరేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మన్‌గా తిరుమాని గోవిందరాజు ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు పోలిశెట్టి పుల్లయ్య నాయుడు, అలవల అలివేలు మంగతాయారు, బొమ్మి రాజేశ్వరి, గన్నాబత్తుల శ్రీనివాస్, బస్వాని లక్ష్మీదేవి, రావిపాటి మణికంఠ, ముత్యాల దుర్గా నాగ సాయి అనూష, ఇలాటి వాసుదేవ శర్మ బోర్డు పాలకవర్గ సభ్యులచే ఇఒ రామచంద్రమూర్తి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా గోవింద రాజు మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. నూతన పాలకవర్గ సభ్యులను ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కారదర్శి కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మత్స్యకారుల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, గన్నాబత్తుల సత్యవతి నూతన కమిటీని అభినందించారు.

పాస్‌పోర్టు పోయింది

పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం వల్లూరు గ్రామానికి చెందిన ఆరుమిల్లి కనక నాగరాజు తండ్రి : వెంకట సుబ్బారావు అను నేను నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. ఇంటి దగ్గర నుండి జిరాక్స్ వెళుతుండగా నాయొక్క పాస్ పోర్ట్ నంబర్ : E3891851 గల పాస్పోర్ట్ ఎవరికైనా దొరికినయెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియచేయగలరు.

అడ్రస్ : **ఆరుమిల్లి కనక నాగరాజు**
తండ్రి : వెంకట సుబ్బారావు
వల్లూరు, ఆచంట మండలం
ప.గో.జిల్లా. సెల్ : 7382086737

ప్రకటన

మహారాజశ్రీ నర్సాపురం ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S.No.215/2024

Between:
వాది : కర్రి పద్మావతి
And
ప్రతివాదులు : 1.కలిగితి విజయ ప్రసాద్
2.కలిగితి విజయ కుమార్

To.
2వ ప్రతివాది :
కలిగితి విజయ కుమార్, తండ్రి వెంకటరావు, డోర్‌నెం.7-88/1, గొల్లెపర చెరువు గట్టు, H/o.యలమంచిలి, యలమంచిలి మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబరు దావాలో 2వ ప్రతివాది హాజరు నిమిత్తం ది.10-12-2025 సం. తేదికి వాయిదా వేసి ఉన్నారు. కావున సదరు వాయిదా రోజున పైకోర్టు వారి ఎదుట ఉదయం 10.30 ని.లకు స్వయంగా కానీ న్యాయవాది ద్వారా కానీ హాజరు అయి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు దావా ముందు గ్రంథము జరుపబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

శ్రీ మేడపాటి వెంకట రామారెడ్డి
నర్సాపురం న్యాయవాది, పాలకొల్లు
తేది.12-11-2025 పశ్చిమ గోదావరి జిల్లా.

ముమ్మాటికి ఇది రాజకీయ హత్యే!

హరిక హత్య కేసులో వైసిపి నేతల పాత్ర
కేసు పక్కదోవ పట్టించేందుకు రూ.50 లక్షల డీల్
పోలీసులపై ఒత్తిడి తెచ్చిన మాజీ మంత్రి కారుమూరి
టిడిపి నేతల ధ్వజం

తణుకు: మండలంలోని ముద్దాపురం గ్రామంలో హత్యకు గురైన ముళ్ళపూడి నాగహరిక కేసులో అప్పటి వైసిపి నేతల హస్తం ఉందని తణుకు టిడిపి నేతలు ధ్వజమెత్తారు. ముమ్మాటికీ ఇది రాజకీయ హత్యేనని పేర్కొన్నారు. శనివారం తణుకు కూటమి కార్యాలయంలో ఆ పార్టీ నేతలు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తేతలి సొసైటీ అధ్యక్షుడు మట్లా వెంకట్, హరిక సమీప బంధువు ముళ్ళపూడి సతీష్ మాట్లాడారు. 2022 నవంబర్ 12వ తేదీన నాగహరిక హత్య వెలుగు చూసిన వెంటనే అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన అప్పటి పోలీసులు అనుమానితురాలు, సవతి తల్లి ముళ్ళపూడి రూప, తండ్రి ముళ్ళపూడి శ్రీనులను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కేవలం అరగంటలోనే ఇంటికి పంపించేశారని ఆరోపించారు. ఈ కేసును మాఫీ చేసేందుకు అప్పటి మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు వెనుకనుండి పోలీసులపై ఒత్తిడి తీసుకువచ్చారని ఆరోపించారు. ఇందుకు సంబంధించి సుమారు రూ.50 లక్షలు చేతులు మారాయని, ఈ వ్యవహారంలో అప్పటి వైసిపి నేత మధ్యవర్తిత్వం చేశారని తెలిపారు. ఇది హత్య అని ఆరోపించిన మృతురాలు మేనమామ, అమ్మమ్మ, తాతయ్యల నుంచి ఎందుకు ఫిర్యాదు తీసుకోలేదని ప్రశ్నించారు. కేవలం విఆర్ఓ నుంచి ఫిర్యాదు తీసుకుని ఈ కేసును తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. అప్పట్లోనే పోస్టుమార్టం రిపోర్ట్ నివేదికలు వచ్చినప్పటికీ అప్పటి అధికార పార్టీ ప్రలోభాలతో బయటపెట్టనీయకుండా అడ్డుకున్నారన్నారు. ఈ కేసులో నిందితురాలు ముళ్ళపూడి రూప వైసిపి మండల మహిళా అధ్యక్షురాలుగా పనిచేస్తున్నారని, ఇదే సమయంలో ఆమె సోదరుడు మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుతో చర్చలు జరిపించిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వృద్ధులను సైతం ప్రలోభ పెట్టి ఈ కేసు నుంచి ఆమెను తప్పించారని ఆరోపించారు. సంఘటన జరిగిన తర్వాత దాదాపు రెండేళ్లపాటు అధికారంలో ఉన్నప్పటికీ ఎందుకు ఈ కేసులో ఫోరెన్సిక్ రిపోర్ట్లు బయట పెట్టలేదని ప్రశ్నించారు. అప్పట్లో వృద్ధులను ప్రలోభ పెట్టారు కనుకే ప్రస్తుతం పోస్టుమార్టం రిపోర్ట్లతో పాటు ఫోరెన్సిక్ రిపోర్ట్ బయటపెట్టడంతో హత్య కోణం బయటపడిందని తెలిపారు. యువతిది హత్య చేసిన నిందితులను కాపాడేందుకు అప్పటి మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు కృషి చేశారన్నారు. రాజకీయంగా ఈ హత్య కేసుతో తమకు ఎలాంటి సంబంధం లేదని వైసిపి నేతలు ఒత్తిడి తీసుకు రాలేదని యువతి మృతి చెందిన ప్రదేశంలోనే బహిరంగ చర్చకు రావాలని మట్లా వెంకట్ సవాల్ విసిరారు. అప్పటి సిఐ ఆంజనేయులు సైతం ఈ కేసులో పెద్ద ఎత్తున ముడుపులు తీసుకున్నారని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి చెందిన మీడియా సంస్థలో పనిచేస్తున్న వ్యక్తి, నిందితురాలు రూప సోదరుడు మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుతో చర్చలు జరిపారని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

భీమవరం టౌన్: మండలంలోని తోకతిప్ప గ్రామంలో మొంథా తుపాన్ కారణంగా నష్టపోయిన కుటుంబాలకు బియ్యం, కూరగాయలు, దుప్పట్లు వంటి అవసరమైన సహాయక సామగ్రిని టిడిపి నాయకులు శనివారం అందజేశారు. కృష్ణబలిజ పూసల వెల్ఫేర్, డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ గంటా త్రిమూర్తులు ఆధ్వర్యాన నిర్వహించిన ఈ సేవా కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి, టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సేవా కార్యక్రమాన్ని ముందుండి నిర్వహించిన త్రిమూర్తులు సేవాస్ఫూర్తి ప్రశంసనీయమన్నారు. టిడిపి పట్టణ అధ్యక్షులు మద్దుల రాము, పట్టణ సెక్రటరీ గోవింద్, భీమవరం మండల అధ్యక్షులు కొయ్యలగడ్డ లక్ష్మి గణపతి, దొంగపిండి సర్పంచి బొడ్డు మోహన్, టిడిపి నాయకులు మైలబత్తుల హైజాక్ బాబు పాల్గొన్నారు.

తణుకు అభివృద్ధికి మార్గదర్శకులు వైటీ రాజా

వర్ధంతి కార్యక్రమంలో టిడిపి నేతలు

తణుకు: తణుకు నియోజకవర్గ అభివృద్ధికి మాజీ ఎంఎల్‌ఎ, కీర్తిశేషులు వైటి రాజా మార్గదర్శకత్వం చూపించారని రెరా సభ్యులు మంత్రిరావు వెంకటరత్నం అన్నారు. శనివారం మాజీ ఎంఎల్‌ఎ వైటి రాజా వర్ధంతి పురస్కరించుకొని స్థానిక టిడిపి కూటమి కార్యాలయంలో ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశాల మేరకు సంతాప సభ నిర్వహించారు. తొలుత వైటి రాజా చిత్రపటానికి పూలమాలలు వేసి పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రిరావు వెంకటరత్నం మాట్లాడుతూ వైటి రాజా రాజకీయాల నుంచి వైదొలగుతూ ఎంతో మంచి రాజకీయ విలువలు కలిగిన ఆరిమిల్లి రాధాకృష్ణను నియోజకవర్గానికి పరిచయం చేశారని తెలిపారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు వినూత్న ఆలోచనలపై దృష్టి సారించాలి

తాడేపల్లిగూడెం : విద్యార్థులు వినూత్న ఆలోచనలపై దృష్టి పెడితే కొత్త కొత్త ఆవిష్కరణలు రూపుదిద్దుకుంటాయని హైదరాబాద్ ఐఐటి కెమికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి, ప్రొఫెసర్, డాక్టర్ చంద్రశేఖర్ శర్మ సూచించారు. ఎపి నిట్‌లోని కెమికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యాన ఫ్రమ్ ఎర్త్ టు మార్స్ పైనీరింగ్ మెటల్ సిఒటు బ్యాటరీ సొల్యూషన్స్ ఫర్ సస్టైనబుల్ ఫ్యూచర్ అనే అంశంపై విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ప్రొఫెసర్ చంద్రశేఖర్ శర్మ మాట్లాడారు. డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి, ఆచార్యులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా గొలుసు దొంగ అరెస్టు

పెనుగొండ : ఒంటరి మహిళలను టార్గెట్ చేస్తూ గొలుసులు దొంగలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకెళితే.. ఈనెల 11వ తేదీన ఉదయం మండలంలోని ఇలపర్రు గ్రామంలో ఒక అపరిచిత వ్యక్తి బుల్లెట్ మోటార్ సైకిల్‌పై వచ్చి సుమారు 67 ఏళ్ల చేకూరి బంగారమ్మ అనే వృద్ధ మహిళను అడ్రస్ అడుగుతూ మెడలోనుంచి సుమారు 3 కాసుల బంగారం తాడును బలవంతంగా లాక్కుని పారిపోయాడు. ఆమె ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు పెనుగొండ సిఐ ఆర్.విజయకుమార్ ఆధ్వర్యాన ఆచంట ఎస్ఐ కె.గంగాధర రావు, కెవి.రమణ కలిసి రెండు బృందాలుగా ఏర్పడి ఈకేసులో ముద్దాయిని రెండు రోజుల్లో అరెస్టు చేశారు. అతని వద్ద నుండి చోరీ సొత్తును స్వాధీనం చేసుకునిరిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు. ముద్దాయి అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన వాసంశెట్టి వీరబాబుగా తెలిపారు.

దీపక్ సాయికి అభినందన

తాడేపల్లిగూడెం: శశి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్ ఎఐఎంఎల్ విభాగానికి చెందిన నంభుల దీపక్ సాయి అమెజాన్ సంస్థలో అత్యుత్తమమైన రూ.33.75 లక్షల వార్షిక ప్యాకేజీను సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ మహమ్మద్ ఇస్మాయిల్ తెలిపారు. ఈ సందర్భంగా శశి ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ ఛైర్మన్ బురుగుపల్లి వేణు గోపాలకృష్ణ, వైస్ ఛైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మహ్మద్ ఇస్మాయిల్ దీపక్ సాయిని అభినందించారు. విద్యార్థుల ప్రతిభను వికసింపజేసి, ప్రపంచ స్థాయి సంస్థల్లో అవకాశాలు పొందేందుకు అవసరమైన నైపుణ్యాలు, శిక్షణ అందించడంలో శశి ఇన్స్టిట్యూట్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని వారు పేర్కొన్నారు. దీపక్ సాయి సాధించిన ఈ విశేష విజయం శశి విద్యార్థులకు మరింత ప్రేరణ ఇచ్చిందని కళాశాల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ అన్నారు. విద్యార్థి తల్లిదండ్రులు కళాశాలకు కృతజ్ఞతలు తెలిపారు.

మహారాజశ్రీ కాకినాడ 5వ అదనపు జూనియర్ సివిలు జడ్జి వారి కోర్టులో

O.S.No.600/2025

Between :
వుల్లి అచ్చెయ్యమ్మ
భర్త కృష్ణ, మెట్ట వీధి, G.మేడపాడు (v), సామర్లకోట మండలం. ...వాది

మరియు

మీసాల లక్ష్మణరావు
తండ్రి రామయ్య,గాంధి నగర్, అత్తిలి (v) & (m), W.G.Dist.
....ప్రతివాది

పై నెంబరు దావాలో ప్రతివాది శ్రీ కోర్టు వారు పంపిన సమన్లు వగైరాలు తీసుకోనికారణంగా వాది అభ్యర్థన మేరకు ప్రతివాదిని యీ ప్రకటన ద్వారా సదరు పై నెంబరు దావాలో హాజరు నిమిత్తం **ది. 31-12-2025** వేసినారు. సదరు తేదిని స్వయంగా గానీ, లాయరు ద్వారా గాని హాజరు అయి అభ్యంతరములు తెలుపని యెడల మీ పరోక్షములో తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

అవసరాల నాగరాజు, B.Sc., B.L.
అడ్వకేట్, డో.నెం. 8-13-9/23, Srya బిల్డింగ్
ప్రతాప్‌నగర్, కాకినాడ-4
కాకినాడ.
ది.15-11-2025
సెల్: 99128 41155

డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్, ఏలూరు, ఏలూరు జిల్లా

A.A.C.F.No. 166/2024

Between:
M/s మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్, తణుకు బ్రాంచ్ ...డిస్పూటెంట్
And
Ms Vaddi Satyavathi and Others ...అపోనెంట్స్

Opp: 5. Kota Srinivasa Kumar,
S/o. K. Janaki Ram, Hindu, Aged 38 Years, Employee, Senior Asst, O/o. Thasildar (MRO Office), Emp Code: 0435045, Tanuku (Mandal), W.G. District. Pin. 534211.
H/o. D.No: 54-16-9, Near Pratibha School, Vidya Nagar, Rajahmandry, E.G. Dist. Pin.533103.

Opp: 6. Veludurthi Pothuraju,
S/o. V. Subbarao, Hindu, Aged 48 Years, Employee, Mandal Revunue Inspector, O/o. Thasildar (MRo Office), Iragavaram (Mandal), W.G. District. Pin. 534217.
H/o. D.No: 13-3-19, Veludurthi Vari Street, Old Town, Tanuku (Mandal) W.G. District. Pin. 534211.

పై నెంబరు దావాలో అపోనెంట్స్ 5 మరియు 6 అయిన మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్ /ఆర్బిట్రేటర్ ఏలూరు వారు మీ హాజరు నిమిత్తం **ది. 21-11-2025 వ తేదిన** వాయిదా వేసినారు. కావున ఆ రోజున **ఉదయం 10-30 ని॥లకు** శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ ఆర్బిట్రేటర్ ఏలూరు వారి ఎదుట వ్యక్తిగతంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరై సంజాయిషీ ఇచ్చుకోగలరు. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది: 21-11-2025
(శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్ / ఆర్బిట్రేటర్ వారి ఉత్తర్వుల ప్రకారం)

మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రై॥ లిమిటెడ్,
మేనేజర్ అడ్వకేట్ ఫర్ డిస్పూటెంట్

O. NAGENDRA KRISHNA
Advocete, Tanuku

డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్, ఏలూరు, ఏలూరు జిల్లా

A.A.C.F.No. 162/2024

Between:
M/s మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్, తణుకు బ్రాంచ్ ...డిస్పూటెంట్
And
Ms Kanuri Satya Sundhari and Others ...అపోనెంట్స్

Opp: 4. Dasari Tirumaleswari,
W/o. Satya Chandra Mukesh, Hindu, Aged 39 Years, Empoye, Emp I.d 0557891, Sec Gr Teachar, MPP School, (Main), Gowripatnam, Devarapalli Mandal, E.G.District. Pin. 534313.
H/o.D.No: 5-36/3, Near Nava Bharat Gate, Govardhanametta Road, 1 Pangidi, Kovvuru Mandal, E.G. District.

Opp: 5. Shaik Nagul Meera,
S/o. Sk Hussain, Hindu, Aged 44 Years, Empoye Emp No. 0556828, JR Lecturer, Govt Jr College, Innispeta Near Rallway Quarters, Rahahmandry, E.G. District. Pin. 533101.
H/o.D.No: 115-15-371, Kontamuru, Near Subrahmanayam Tempul, Rajahmundry E.G. District. Pin. 533102.

Opp: 8. Sandaka Satyanarayana,
S/o. S. Suryarao, Hindu, Aged 59 Years, Empoyye, Emp No. 0428205, SEC Gr Teacher, MPP School (Main), Hukumpeta, Gopalapuram Mandal, E.G. Distict, Pin. 534318.
H/o.D.No: 4-5-32/2, Vegivari Chavadi, Vanapalli Nagaraju, Near Bhavya Grand, Kovvuru, E.G. District. Pin. 534318

పై నెంబరు దావాలో అపోనెంట్స్ 4 మరియు 5 మరియు 8 అయిన మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్ /ఆర్బిట్రేటర్ ఏలూరు వారు మీ హాజరు నిమిత్తం **ది. 21-11-2025 వ తేదిన** వాయిదా వేసినారు. కావున ఆ రోజున **ఉదయం 10-30 ని॥లకు** శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ ఆర్బిట్రేటర్ ఏలూరు వారి ఎదుట వ్యక్తిగతంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరై సంజాయిషీ ఇచ్చుకోగలరు. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది: 21-11-2025
(శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్ / ఆర్బిట్రేటర్ వారి ఉత్తర్వుల ప్రకారం)

మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రై॥ లిమిటెడ్,
మేనేజర్ అడ్వకేట్ ఫర్ డిస్పూటెంట్

O. NAGENDRA KRISHNA
Advocete, Tanuku

డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్, ఏలూరు, ఏలూరు జిల్లా

A.A.C.F.No. 165/2024

Between:
M/s మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్, తణుకు బ్రాంచ్ ...డిస్పూటెంట్
And
Mr Mohammed Rehaman Shariff and Others ...అపోనెంట్స్

Opp: 1. Mohammed Rehaman Shariff,
S/o. Md. Sarajuddin, Hindu, Aged 33 Years, Business, Proprietor, Cold Fish, near Big Mosque, Akividu (Mandal), W.G.District. Pin. 534235.

Opp: 3. Shaik Arif, S/o. Sk Jahangeer, Hindu, Aged 36 Years, Business, Prop, Arif Fish Packing, Opp. Small Mosque, Akividu (Mandal), W.G.District. Pin. 534235.
D.No: 14-17/1, Near Urdu School, Small Mosque, Akividu (Mandal), W.G. District. Pin. 534235.

Opp: 5. Mohmmed Sirajuddin,
S/o. Md. Babjan, Hindu, Aged 55 Years, Business, Fish Commission Agent, PP Road, Near Big Mosque, Akividu (Mandal), W.G. District. Pin. 534235.
H/o.D.No: 5-50/51, PP Road, Near Big Mosque, Akividu (Mandal), W.G. District. Pin. 534235

Opp: 6. Mohmmued Sajeda Begum,
W/o. Md. Sirajuddin, Hindu, Aged 50 Years, Business, Fish Commission Agent, PP Road, Near Big Mosque, Akividu (Mandal), W.G. District. Pin. 534235.
H/o.D.No: 5-50/51, PP Road, Near Big Mosque, Akividu (Mandal), W.G. District. Pin. 534235

